# జిల్లా స్థాయి ప్రేమకథ

## -వి. పి. బి. నాయర్

ఈ కథలోని ప్రధానపాత్రల్లో ఒకరు జిల్లా కలెక్టరైతే, మరొకరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్. సౌకర్యార్థం వీళ్ళను కలెక్టర్, ఎస్.పి.గా పిలుద్దాం. మామూలుగా కథల్లో ఉన్నట్లే, ఈ కథలో కూడా ఒక నాయకుడు, నాయికా ఉంటే, కలెక్టర్‌ను స్త్రీగాను, ఎస్.పి.ని పురుషుడుగానూ తొంభైశాతం మంది భావిస్తారు. అట్లా భావించటమూ సహజమే. కానీ ఇట్లాగే ఉండాలన్న నియమమేమీ లేదుగదా!

ఈ కాలంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో మహిళా ఐ.పి.యస్. అధికారులున్నారు. అందుకే ఈ కథలో మహిళా ఎస్.పి, పురుష కలెక్టర్ ఉన్నారని చెప్తే అది అసమంజసమేమీ కాదు. కానీ ఎస్.పి.గా పురుషుడు, కలెక్టర్‌గా స్త్రీ ఉన్నారని చెప్పటానికే అవకాశాలెక్కువగా ఉంటాయి. ఫర్వాలేదండీ; ఆ విషయం ఎట్లా ఉంటే మనకేమిటి? కథలోని పాత్రల కంటే కథే గదా మనకు ముఖ్యం. ఈ ఉన్నతాధికారులిద్దరూ పనిచేస్తున్న రాష్ట్ర మేదీ అని మీరడుగుతారేమో? రాష్ట్రం ఏదైనా, జిల్లా మాత్రం తీవ్రవాదులు, అడవులు, అతిధిగృహాలు కలిగి ఉన్నదే.

మన కథలోని కలెక్టర్, ఎస్.పిల వయసు దాదాపు ఒకటే. వాళ్ళ వయసు ముప్పై, ముప్పై అయిదు సంవత్సరాల మధ్య ఉంటుంది. ఇరువురూ వివాహితులే. నాయికకు ఇద్దరు కుమారులుంటే నాయకునికి ఒక కూతురు ఉంది. నాయిక మొగుడు రాజధానిలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు మూడు రోజులు సెలవు దొరికితే భార్యాపిల్లల్ని చూడటానికి జిల్లాకు పయనమైవస్తాడు. భార్యను చూడాలనే అభిలాష ఏమోతాదులో ఉన్నా పిల్లల్ని చూడాలన్న ఆరాటం అతనిలో ఎంత అధికంగా ఉంటుందో తండ్రి పేగు బంధం తెలిసిన ప్రతి వ్యక్తికీ అర్ధమవుతుంది.

నాయకుని పొడుగు దాదాపు ఆరడుగులు. అందుకు తగ్గ పటిష్టమైన శరీరం; లౌడ్ స్పీకర్ పెట్టి చెప్పకపోయినా పౌరుషాన్ని చాటిచెప్పే పెద్దమీసాలు..చామన ఛాయకూ నలుపునకూ మధ్య ఉండే రంగు...అందర్నీ ఆకట్టుకొనేట్లు ఉండే వదనం..అత్యంత ఆకర్షణీయమైన చిరునవ్వు....అమితాబ్‌బచ్చన్ గొంతు...ఎదుటివాడి గుండెల్ని సూటిగా తాకే హాస్యధోరణి, పరులను పరిహాసం చేయని నైజం, అతను చెప్పే కొన్ని చతురోక్తులు ట్యూబ్‌లైట్ బుర్రలకు త్వరగా అవగాహనకావు. అతనితో మాట్లాడుతూ కూర్చొంటే సమయం ఎట్లా గడిచిపోతుందో కూడా స్పృహకు రాదు.

ఇహ మన నాయిక విషయం; ఆమె కూడా మంచి ఆఫీసరే. ఆమె గూర్చి ఒకే ఒక విమర్శ వినిపిస్తుంది; ముక్కుసూటిగా పోయే వైఖరి ఆమెదని. నియమాలు నిబంధనలు మనిషి సౌకర్యం కొరకే ఏర్పాటు చేయబడ్డవన్న విషయాన్ని ఆమె విశ్వసించేది కాదు. ప్రజా సేవకురాలిగా గాక, తానొక ప్రభుత్వ అధికారినన్నట్లుగా ఆమె ప్రవర్తించేది. ఈ విషయాన్ని గూర్చి భర్త ఆమెతో ప్రస్తావిస్తే ''మిస్టర్ సీనియారిటీ లిస్టులో మీకన్నా నేను పైనున్నాను'' అని సూటిగా సమాధానం చెప్పేది. ''ఒక్క సీనియారిటీలోనే కాదు, అన్ని విషయాల్లోనూ నీవు నా పైన ఉండటమే నాకు సంతోషం'' అంటూ అతను బదులివ్వటంతోటే వాళ్ళ మధ్య శీతల సమరం ఆరంభమవుతుంది. అయితే, ప్రస్తుతం ఆ భర్త వైఖరిలో కొంత పరిపక్వత వచ్చింది. ఉద్యోగ సంబంధ విషయాలేవీ భార్యతో చర్చించ కూడదనే నిర్ణయం ఒకటి తీసుకోవటమే ఇందుకుదాహరణ. సీనియారిటీలోనే కాక స్నాతకోత్తర పట్టా పొందటంతోనే కాక, ఉన్నత కుటుంబం నుంచి ఆమె వచ్చినందువల్ల కేవలం సంతానం ప్రాప్తికి మాత్రమే ఆమెను సమీపించే ఒక భర్తగా ఉండటమే శ్రేయస్కరమని అతను తలపోశాడు.

> **ఈ కథను చదువుతున్నప్పుడు మీకు కొన్ని సందేహాలు, సంశయాలు రావచ్చు. వీటికి తగిన సమాధానాల్ని చెప్పవలసిన బాధ్యతను నేను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించననే 'ప్రీ కండిషన్'తో ఈ కథకు హరిశ్రీకారం చుడుతున్నాను. అసలు ఈ కథలో పాత్రలకు పేర్లు గాని, స్థలాల వివరాలుగాని ఏవీ ఉండవు.**
>
> **-రచయిత**

మన నాయిక చూపులకు ఒక మోస్తరుగా ఉంటుంది. అయిదడుగుల అయిదంగుళాల ఎత్తు కలిగి ఉన్నదంటే స్త్రీలలో ఇది అసాధారణంగానే భావించాలి. కొంచెం సన్నగా ఉన్నందువల్ల.చీరె ధరించినపుడు ఆరడుగుల ఎత్తు ఉన్నట్లుగా ఆమె కన్పిస్తుంది. అయిదడుగుల ఆరంగుళాల కన్నా ఎత్తు తక్కువ ఉన్న పురుషులంటే ఆమెకు చాలా చులకన భావం. తనకన్నా ఒకే ఒక్క అంగుళం ఎత్తు అధికంగా ఉన్న భర్త పట్ల ఆమె మనసులో ఎటువంటి అభిప్రాయాలున్నాయో తెలిసి కోవాలనుకోవటం మన కనవసరం.


ఆమె వంటి ఛాయ చాలా మంచిది. శరీరంలో ఎక్కడెక్కడ ఒంపులు, సొంపులు ఉండాలో అవ్వన్నీ ఆమెకు సవ్యంగానే ఉన్నాయి. ఎన్నడోగాని కన్పించని చిరునవ్వును ఆమె ఎప్పుడైనా ప్రదర్శించినా అందులోనూ అధికార దర్పమే గోచరిస్తుంది. ప్రథమ పుత్రునికి ఆరు, ద్వితీయ పుత్రునికి నాలుగు సంవత్సరాల వయస్సున్నప్పుడు ఆమె ఆ జిల్లా అధికారిగా నియమితురాలైంది. ఆమె భర్త అక్కడకు చాలా దూరంగా ఉన్న రాజధానీ నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇట్లా విడివిడిగా దూరదూరంగా ఉన్నాగానీ ఆ విరహ భావమేదీ వాళ్ళల్లో ఏ కోశానా కన్పించదు.

ఆ జిల్లా ఎస్పీ స్త్రీయా, పురుషుడా అనే విషయం కానీ, ఆ జిల్లాకలెక్టరుకు మీసాలా, గాజులా ఏవి ఉన్నాయన్న సంగతి గానీ ఇప్పుడుకాదు, కథ పరిసమాప్తమయ్యేప్పుడు కూడా తెలుసుకోలేం. అందుకే లింగభేదాల్ని పరిగణనలోకి తీసుకురాకుండా కథను కొనసాగిద్దాం.

మన నాయికా నాయకులిరువురూ ఎటువంటి అభిప్రాయభేదాలు లేకుండా కలసి పనిచేసే వారు. సభలు, సమావేశాలనేగాక, ఉద్యోగధర్మంగా ప్రతి రోజూ వాళ్ళు కల్సుకొనేవారు. నాయకుడు నాయికకు టెన్నిస్ క్రీడ అభ్యాసం చేసినందువల్ల ప్రతి దినం ప్రభాత సమయాల్లో ఒక గంట సేపు కల్సి ఉండే అవకాశం వాళ్ళకేర్పడింది. అప్పుడప్పుడు నాయకుడు తన శ్రీమతిని కూడా కోర్టుకు తీసుకువచ్చేవాడు. ఆఫీసులలో వాళ్ళిరువురూ ఎల్లప్పుడూ కల్సుకోవటం వింత ఏం లేదుగాని, ఇట్లా పొద్దుటి పూట క్రీడామైదానాల వద్ద, స్విమ్మింగ్ పూల్‌ల వద్ద ప్రతిరోజూ కల్సుకోవటం మాత్రం మగ ఆఫీసర్ భార్యకుగానీ, ఆడ ఆఫీసర్ భర్తకుగానీ అసూయ, అనుమానాలు కలగటం సహజమేకదా! నాయకుడు తన భార్యను క్రీడామైదానానికి తీసుకురావటంతో భర్తపట్ల ఆమె విశ్వాసం సడలిపోకపోవటమేగాక, నాయిక భర్తకు కూడా పెద్దగా అనుమానం రాకుండా ఉండేట్లు చేసేది.

ఆ జిల్లాలో అరణ్యాలున్నందువల్ల, అక్కడ ఉగ్రవాదుల చర్యలు కొనసాగుతున్నందువల్లా ఈ ఇరువుకీ తరచూ టూర్‌కు వెళ్ళే అవసరమేర్పడేది. ఎక్కడికి వెళ్ళినా వేరు వేరు గదుల్లోనే వాళ్ళు విశ్రమించే వాళ్ళు. వాళ్ళ చుట్టూ పరిజనం కూడా ఉండేది. అందువల్ల వాళ్ళ విషయంలో ఎటువంటి సందేహం పడాల్సిన అవసరం లేదు.

తరచుగా నాయిక, ఆమె ఇరువురు పిల్లలూ రాత్రి భోజనాలు నాయకుడి ఇంట్లోనే చేసే వారు. నాయిక భర్త కూడా ఇక్కడ ఉండటం తటస్థిస్తే ఇటువంటి విందుల్లో పాల్గొనేవాడు. అతనికి మన నాయకుని గుణగణాలపై గొప్ప అభిప్రాయముండేది. అప్పుడ



ప్పుడు నాయకుడు, అతని భార్యా కూతురు నాయిక ఇంటికి వెళ్ళి రాత్రి భోజనం చేసేవారు. ఈ విధంగా ఈ రెండు కుటుంబాల వారు ఎంతో అన్యోన్యంగా, ఉల్లాస భరితంగా రోజుల్ని గడిపేవారు.

మన నాయికా నాయకులు ఈ విధంగా సుహృద్భావంతో సహజీవనం చేయటం ఆ జిల్లాలోని కొందరు అధికారులకే గాక, ఇతర జిల్లాలోని ఉన్నతాధికారులకు కూడా ఎంతో కంటగింపుగా ఉండేది. ఆ జిల్లాలోని పోలీస్ రెవెన్యూ సిబ్బంది కూడా వీళ్ళ అన్యోన్య జీవనం పట్ల చెవులు కొరుక్కొనే వాళ్ళు. వీళ్ళ అక్రమ సంబంధాన్ని సాక్ష్యాలతో సహా బహిర్గతం చేయాలని కొందరు సిబ్బంది ఎంతగా ప్రయత్నించినా, అటువంటి అవకాశాన్ని మన నాయికా నాయకులు వీళ్ళకెన్నడూ కల్పించలేదు.

తనకు ప్రతిరోజు ఎంతో చేరువుగా సంచరిస్తున్న నాయకుణ్ణి జాగ్రత్తగా పరిశీలించిగాని సన్నిహితం కాకూడదని నాయిక భావించింది. అతనెంత పెద్దమొనగాడైనా తన ముందు అతని పప్పులేం ఉడకవన్న ధీమాతో మన నాయిక ఉండేది. అతనికెటువంటి అతిచనువూ ఇవ్వకూడదని ఆమె తలపోసింది. ఒక అధికారిగానే తప్ప ఒక స్త్రీ అన్న భావంతో అతను తనను చూడగూడదన్నదే ఆమె ఉద్దేశ్యం. ఇతనేకాదు; మరే పురుషుడైనా సరే ఒక అధికారిగా తనకు గౌరవ మర్యాదలు ఇచ్చి తీరాలన్నదే ఆమె భావం.

కానీ కొంతకాలం గడిచేటప్పటికీ ఆమె ఆలోచనా ధోరణిలో ఎంతో మార్పు గోచరించింది. ''ఎంతమంచి అధికారి ఇతడు, భార్యాపిల్లల పట్ల ఎంత ఆదరాభిమానాలు చూపిస్తున్నాడు, భర్త అంటే ఇట్లా ఉండాలి; ఇటువంటి తండ్రి లభించటం ఆ పాప అదృష్టం కాక మరేమిటి! ఓహ్...ఈ వ్యక్తిగత విషయాల మీదికి మనసు పోతున్నదేమిటి?....ఇవ్వన్నీ నాకనవసరం కదా! కానీ, ఒక అధికారిగా కూడా అతనెంత ఉత్తముడు! ఇంత తక్కువ కాలంలో ఎంత మంచి పేరు సంపాదించాడు! అతన్ని ఇష్టపడని వాళ్ళు ఎవ్వరైనా ఈ జిల్లాలో ఉన్నారా? ఎవరినోట విన్నా అతన్ని గూర్చిన ప్రశంసలే. విధి నిర్వహణ విషయాల గూర్చి చర్చలు జరిగేటప్పుడు ఎంత ఆకర్షణీయంగా మాట్లాడుతున్నాడు! ఎల్లవేళలా చిరునవ్వులు చిందించే అతని వదనంలో అధికార దర్పం ఎన్నడైనా కన్పిస్తుందా?

నా భర్తా ఒక అధికారే! ఇంతగా ఆకట్టుకొనేట్లుగా అతను మాట్లాడగలడా? అతని ముఖంలో ఎన్నడైనా ఇంతటి ప్రసన్నత దర్శనమవుతుందా? ఇతడు నా పట్ల ప్రదర్శించే మర్యాదా మన్ననల్లో నూరవ వంతైనా నా భర్త చూపెట్టగలిగాడా? ఇతను తన భార్య పట్ల చూపెట్టే ప్రేమానురాగాల్లో పదవ వంతైనా నా పట్ల నా భర్త చూపెడుతున్నాడా? మాది ప్రేమ వివాహమే అయినా, సంవత్సరాలు గడిచే కొద్దీ మా మధ్య అంతరం పెద్దదవుతూ వస్తున్నది. అయినా, ఇవన్నీ నేను భరించగలుగుతాను. కానీ అతని ఆత్మన్యూనతా భావాన్ని భరించటం మాత్రం నా వల్ల కాదు. మా మధ్య జరిగే కలహాలకు ప్రధాన కారణం ఈ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సే. సరే; భార్యాభర్తలన్న తర్వాత ఈ ఘర్షణలు రావటం సహజమే. పోనీ తన వాదనే సవ్యమైనదని సమర్థించుకొనే శక్తయినా అతనికుందా? ఈ శక్తి లేదుగాబట్టే అతను చేయగలిగిందల్లా అలిగి కూర్చోటమే.


పురుషత్వం అనేది ఇద్దరు పిల్లల్ని పుట్టించటంతోనే రుజువైపోతుందా? ఎత్తు తక్కువ ఉన్న వాళ్ళకుండే జబ్బే ఇది. ఎంత చదువున్నా, ఎంత హోదాలో ఉన్నా వీళ్ళలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉంటుంది. చదువులో, హోదాలో నా భర్త, ఇతడు సరిసమానంగానే ఉన్నారు. కానీ నా భర్తలో ఉన్న ఆ న్యూనతా భావం అతన్నెంత అశక్తునిగా మార్చివేసింది? దీనికి కారణమేమిటి? తన చుట్టూ ఉన్న వాళ్ళందరూ తనకంటే పొడగరులనీ, తనను చిన్న చూపు చూస్తున్నారనీ అతను భ్రమిస్తున్నాడు. మరో వైపు నా సహచరుడైన ఈ అధికారిని చూడండి. ఆరడుగల స్ఫురద్రూపమే ఇతని క్కావాల్సినంత ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని చేకూర్చిపెడుతూ ఉంది.

మైగాడ్; ఏమైంది నాకీరోజు? మొదట్లో ఎటువంటి చనువూ ఇవ్వక దూరంగా ఉంచాలనుకొన్న 'అతను', కాలం గడిచే కొద్దీ అభిమానభావం పెల్లుబికి 'వారు' సంబోధన స్థాయికి ఎదిగి ఇప్పుడు మరీ 'ఆత్మీయుడు'గా చేరువైనాడే! కానీ ఒక మంచి వ్యక్తిని మిత్రుడుగా ఆదరించటంలో అసహజమేమీ లేదు కదా! ఈయన నా పట్ల ఎంత గౌరవంగా, మర్యాదగా వ్యవహరిస్తున్నాడు! ఎన్నో జన్మల అనుబంధం ఉన్నట్లు ఎంత సామీప్యమై పోయినాడు. ఇటువంటి ఆప్యాయతానురాగాలనే అతనిపట్ల ప్రదర్శించటం నా కనీస ధర్మం కదా! ఇంతటి ఉదార వ్యక్తులతో అనుబంధం కల్గి ఉండటం క్షేమదాయకమే. ఏమైనా ఇతని పట్ల నాకు ఆరాధనా భావం లేదని చెప్పటం నన్ను నేనే మోసగించుకొన్నట్లవుతుంది''

ఈ మన నాయిక మనసులో ఇంతటి సంక్షోభ భావతరంగం సృష్టికి ప్రేమ అని పేరు పెట్టటమే సమంజసం కదూ! కానీ ఈ లవ్ ఒన్‌వే ట్రాఫిక్ వంటి

పుతుందా? అతని మనసులోనూ ఆమె స్థానం సంపాదించుకోగలిగిందా?

మన నాయకుడు పుట్టుకతోనే గౌరవభావాన్ని పుణికి పుచ్చుకొన్న వ్యక్తి. మర్యాద ఇచ్చి పుచ్చుకోవటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. మనసులో ఒకటి క్రియలో మరొకటి చేసే నైజం అతనిది కాదు. ఏ వ్యక్తితోనూ అమర్యాదగా వ్యవహరించే తత్వం కాదు అతనిది. మానవజాతినే కాదు, సకల జీవరాశినీ ప్రేమించే స్వభావం అతనిది. ప్రకృతిలో విలీనమైపోయే సరళి అతనిది. ఇదంతా బాగానే ఉందిగానీ, ఈ మహిళా అధికారి గూర్చి అతని ఆలోచనలేమైనా ప్రత్యేకంగా ఉన్నాయా?




ఉన్నట్లేమీ కన్పించటం లేదు. రోజూ ఇంత సమీపంగా సంచరించే స్త్రీ పురుషుల మధ్య సహజంగా ఏర్పడే ఒక ఆత్మీయతా అనుభూతి లాటిది అతనిలోనూ కొంత పొడ చూపింది. ''ఏ స్త్రీ అధికారితో ఒక పరిమితికి మించి ఎటువంటి చనువునూ నేను తీసుకోకూడదు. నాకు అనుకూలవతియైన భార్య ఉంది; ఎంతో అందమైన పాప ఉంది. అటువంటి మంచి భార్యను ఏనాడూ వంచించకూడదు. మరైతే ఈ మహిళా ఆఫీసర్‌ను నేనెందుకు టెన్నిస్ కోర్టుకు ఆహ్వానిస్తున్నాను. ఆమెతో ఎందుకంత అతి మధురంగా మాట్లాడుతున్నాను? ఆమెను నవ్వించే ప్రయత్నాలెందుకు చేస్తున్నాను నేను? ఆమె చేతి వ్రేళ్ళను స్పర్శించేటప్పుడు నాలో ఎందుకు పులకరింతలు కల్గుతున్నాయి? మా కరచాలనాలు ఎందుకంత అధిక సమయం తీసుకొంటున్నాయి? అవసరమున్నా, లేకపోయినా ఈ కరచాలనాలీమధ్య చాలానే అవుతున్నాయి. ప్రతిరోజూ గుడ్ మార్నింగ్, గుడ్‌నైట్‌లు చెప్పుకొనే సందర్భాలలో ఇచ్చుపుచ్చుకొనే కరచాలనాలతోపాటు మా మనసులు కూడా ఆహ్లాదంగా ఎందుకు చలిస్తున్నాయి?

కానీ ఈ కొత్త సంబంధం కారణంగా, నా భార్యకు నాకూ మధ్య ఉన్న అనుబంధానికి ఏదైనా లోపం ఏర్పడిందా? నో..నో, మునుపటి కంటే ఇంకా ఎక్కువగా నా భార్యను ప్రేమిస్తున్నాను నేను.

అయితే ఈ కొత్త ప్రేమ ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చింది?

అంగీకరించక తప్పదు. ఈమెనూ నేను ప్రేమిస్తున్నాను, ఈ ప్రేమదాహం రోజు రోజూ పెరుగుతూనే వస్తున్నది. కానీ ఈ కారణంగా నాకూ నా భార్య మధ్య ఉన్న ప్రేమ బంధానికి ఎటువంటి లోటూ కలుగదు. భార్యను ప్రాణ సమానంగా చూసుకొనే వ్యక్తి, వేరే స్త్రీని గాని, పురుషుణ్ణిగాని, ప్రకృతినిగాని ఆరాధించకూడదని ఏమైనా ఉందా? భార్యను ప్రేమించే వ్యక్తి ఇతరుల్ని ద్వేషించాలని ఎక్కడైనా ఉందా? అసలు సమస్త లోకాన్నీ ద్వేషించే వ్యక్తి భార్యను మాత్రం ప్రేమించగలుగుతున్నాడా?

నాతో పనిచేస్తున్న ఒక ఆడది.. యువతి.. రూపసి..నా సామీప్యం వల్ల ఆమెకు సంతోషం లభిస్తూ ఉంటే నాకూ ఆనందమే గదా! ఆమె ఉల్లాసాన్ని అధికం చేయటానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. దానివల్ల నేనూ ఉల్లాసాన్ని పొందుతున్నాను. ఒక ఆడది నా నుంచి ఇంత శాంతిని పొందుదామనుకొన్నప్పుడు, దానిని అందించలేనంత మూర్ఖుణ్ణి కాదు నేను.

ఈ స్త్రీతో ఏర్పడ్డ బంధాన్ని నేనూ కావాలనే పెంచి పెద్ద చేస్తున్నానే; ఇది నా భార్యను మోసగించటం కాదా? కానే కాదు; ఒకటి ఉద్యోగ సంబంధమైనదైతే, రెండోది కేవలం వ్యక్తిగతమైనది. డోంట్‌మిక్స్ యువర్ అఫీషియల్ లైఫ్ విత్ యువర్ పర్సనల్ వైఫ్.

-)+ౌఆఆ ఓహ్... ఇది చాలా మంచి పాలసీనే. నేనొక స్త్రీకి భర్తనైనంత మాత్రాన 'యానిమల్ హజ్బెండరీ డిపార్ట్‌మెంట్' లో పనిచేయకూడదని ఏం లేదే. గృహం స్వర్గంగా భావించినప్పుడు ఆఫీసును నరకంగా చేసుకోవాల్సిన అవసరమేమీ లేదు. ఈ సమర్ధనలన్నీ బాగానే ఉన్నాయి. ఆమె వక్షస్థలం పైనికొంగు కొంచెం పక్కకు తొలిగితే ఆ వైపే దొంగ చూపులు చూస్తూ ఉండిపోవటం నా బలహీనత కాదా? ఇటువంటి స్థాన భ్రంశంలు ఈ చీరలకు ఇటీవల కాలంలో పరిపాటి అయింది. ఏమిటీ ఆమె కింత అజాగ్రత్త! నాతో మాట్లాడేటప్పుడు ఆమె పెదాలపై ఒక కొత్త మెరుపును గమనిస్తున్నానే; ఆమె నా ముందు నడుస్తూపోతున్నప్పుడు ఆమెతో సమానంగా నడవాలని నేనెందుకు ప్రయత్నించటం లేదు?

ఈ విధంగా తనని తాను సమర్ధించుకోవటమే అతనికి చాలా తేలికన్పించింది.

నాయికా నాయకుల మధ్య ఉన్న ఆ కాస్త దూరం మరింత దగ్గరైంది. ఏ విషయం ఆలోచించటానికైనా, ఆచరించటానికైనా వాళ్ళల్లో ఎటువంటి తడబాటు లేదు. తమ సామీప్యం బహిర్గతం కాగూడదని ఇరువురూ నిర్ణయించుకున్నారు.

ఓ రోజు వాళ్ళిద్దరూ జిల్లా సరిహద్దుల్లో ఒక ప్రాంతంలో కాంపు చేశారు. తమ అధికార కార్యకలాపాలన్నింటినీ పగలు పూర్తి చేసుకున్నారు. సాయంకాలం స్నానాదులు ముగించుకొని చక్కగా ముస్తాబు చేసుకొని ఒక ప్రయివేటు కారులో ఆ ఇద్దరూ ఎక్కడికో ప్రయాణం కట్టారు. డ్రైవింగ్ సీటులో ఎస్.పి.... అంటే ఎస్.పి.యే నాయకుడని భావించవద్దని మనవి.

ఆరోజు వరకూ తలపెట్టని ఇటువంటి కృత్యానికి ఆ ఇరువురూ పాల్పడడంతో సిబ్బంది యావత్తూ ఆశ్చర్యపోయారు. ఆశ్చర్యపోవటమేగాదు, చెప్పరానంత ఆందోళనతో అల్లాడిపోయారు. ఉగ్రవాదుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న ఆ ప్రదేశంలో పోలీసు రక్షణ లేకుండా డ్రైవరు తోడు కూడా లేకుండా, కనీసం వైర్‌లెస్ సెట్ అయినా తీసుకెళ్ళకుండా ఈ ఇద్దరు ఉన్నతాధికారులూ ఇట్లా బయలుదేరటం ఎంతో ప్రమాదమని వాళ్ళు భయపడ్డారు.

కలెక్టర్‌గారి క్యాంప్‌క్లర్క్ చాలా బుద్ధిమంతుడు. ఒక ఫారెస్ట్ గెస్ట్ హౌస్ గూర్చి ఆ మధ్యాహ్నం కలెక్టర్ గారు ఎవరినో అడుగుతుండటం ఈ క్యాంప్ క్లర్క్ వినటం జరిగింది. సాయంత్రం వాళ్ళ కారు ఏ దిశకు పోతున్నదో కూడా అతను గమనించాడు.

ఒక ఏభైయి అరవై కిలోమీటర్ల వరకూ ఈ ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ తప్ప వేరే ఎటువంటి గెస్ట్‌హౌస్ లేదన్న విషయం అతనికి బాగా తెల్సు. ఆ గెస్ట్‌హౌస్ వ్యవహారాలను చూస్తే అధికారికి ఫోన్ చేసి కలెక్టర్ గారికి ఎటువంటి సదుపాయా లేర్పాటు చేశారని ప్రశ్నించాడు ఆ కాంప్ క్లర్క్. ఆ రాత్రి జరగబోయే అతి రహస్య సమావేశం కొఱకు ఆ గెస్ట్‌హౌస్‌నంతా శుభ్రం చేసి ఒక్క వాచ్‌మెన్‌ను మాత్రమే అక్కడ ఉంచటం జరిగిందని ఆ అధికారి సమాధాన మిచ్చాడు.

కలెక్టర్‌గారి క్యాంప్‌క్లర్క్ పేరు సి.సి. ప్రసాద్. అతని పేరుకు ముందు సి.సి. అని ఉండటం వల్ల ఒక్క కలెక్టరే గాక, అందరూ అతన్ని 'సి.సి' అని పిల్చేవారు. ఇహ ఏమాత్రం ఆలస్యం చేయకుండా సి.సి. ప్రసాద్, జిల్లా కేంద్రంలో ఉండే తన ఆప్తమిత్రుడు ఎస్.ఆర్.పరమగురుతో టెలిఫోన్‌లోమాట్లాడాడు.

అతను ఓ వార్తా పత్రికకు పనిచేస్తూ ఉన్నాడు. పరిశోధనాత్మక జర్నలిజంలో అతనికి ప్రత్యేక ఆసక్తి!

సి.సి. ప్రసాద్‌తో ఈ పరమగురువు చాలా సన్నిహితంగా వ్యవహరించేవాడు. జరిగిన విషయాన్నంతా పరమ రహస్యంగా పరమ గురువుకు చెప్పిన తర్వాత ''ఈ వ్యవహారం ఇహ నీవే చూసుకో. ఎంత సమర్ధంగా దీనిని ఉపయోగించుకొంటావో నాకూ చాడాలని ఉంది.'' పది నిమిషాల పర్యంతం దీర్ఘాలోచనలో పడిపోయాడతడు. తర్వాత అతను అడిషినల్ ఎస్.పి. కె.పి. గుహ ఇంటికి పరుగెత్తుకు వెళ్ళాడు.

''సార్. ఇప్పుడు నేను చెప్పబోయే విషయం మీరు చాలా శ్రద్ధగా వినాలి, వెంటనే తగు చర్య కూడా

తీసుకోవాలి మీరు. నూటికి నూరుపాళ్ళు విశ్వసనీయమైన సమాచారం ఇది. ఈ రాత్రికి ఉగ్రవాద రాష్ట్రనాయకులు అగస్త్య పాదారణ్యంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో రహస్యంగా సమావేశం గాబోతున్నారు. అర్ధరాత్రి వరకూ ఈ సమావేశం కొనసాగుతుంది. తెల్లవారు జామకు ముందే వాళ్ళు పారిపోతారు.''

కొద్దిగా సందేహిస్తూ '' ఈ విషయం నీకెట్లా తెల్సు?'' అని ప్రశ్నించాడు అడిషినల్ ఎస్పీ.

''ఇటువంటి ప్రశ్నలేవీ ప్రస్తుతం మీరు వేయవద్దు. అతి రహస్యంగా దాడి జరపటానికి త్వరగా సిద్ధంకండి. దీని ఫలితం ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది.''

''ఎస్.పి.గారు ప్రస్తుతం ఆ ప్రాంతంలోనే ఉన్నారు. ఫోనులోగానీ, వైర్‌లెస్‌లోగానీ ఈ విషయం ఆయనకు తెలియజేస్తాను''

''సార్..నేనిక్కడికి పరుగెత్తుకు వచ్చిన కారణం ఏమిటి? ఇటువంటి విషయాలు ఫోన్‌లో మాట్లాడగూడదనే కదా! వైర్‌లెస్‌లో చెప్తే ఉగ్రవాదులకే ముందు తెల్సిపోతుంది. లేకపోతే మీ వాళ్ళే ఎవరైనా ఆ సమాచారాన్ని వాళ్ళ కందిస్తారు. ఇందుకోసమే ఈ విషయాన్ని ఎవరితోనూ మీరు ప్రస్తావించ వద్దు. వెంటనే మీరు ఒక జీపు, ట్రక్కు సిద్ధం చేయండి. ఇరవైమంది మనతో ఉంటే సరిపోతుంది. ఆ గెస్ట్‌హౌస్‌కు కొంచెం ముందు ఒక రోడ్డు మలుపు ఉంది కదా! అక్కడ దాకా జీపు, ట్రక్కూ తీసుకుపోవచ్చు. దానికి కొంచెం ముందే 'హెడ్‌లైట్స్' ఆఫ్ చేయాలి. ఈ రాత్రి మంచి వెన్నెలతో ఉన్నందువల్ల హెడ్ లైట్స్ లేకపోయినా కొంచెం దూరం ప్రయాణించవచ్చు. ఆ తర్వాత ఒక పది పదిహేను నిమిషాలు నడవాలి. మనవాళ్ళను మామూలు బూట్స్ కాకుండా కాన్వాస్ షూస్ వేసుకోమని చెప్పండి. నాలుగు వైపుల్నుండి ఆ గెస్ట్ హౌస్‌ను చుట్టుముట్టి లొంగిపొమ్మనమని వాళ్ళను హెచ్చరించాలి. అన్ని వైపుల్నుండి ఫ్లాష్ లైట్స్ గూడా ఆ గెస్ట్ హౌస్ మీద పడాలి. ఆ గెస్ట్ హౌస్ నుండి వాళ్ళు బయటపడటానికి వెనక, ముందు ఉన్నవి రెండు మార్గాలే. వాటిని కవర్ చేస్తే వాళ్ళు తప్పించుకు పోవటానికి అవకాశమే ఉండదు''

''ఏమయ్యా నీవే ఒక పెద్ద పోలీసాఫీసర్ లాగా మాట్లాడుతున్నావే. సరే. ఒక ట్రయల్ చేసి చూద్దాం. ఒక ముప్పావుగంటలో బయలుదేరుతాం. కానీ, నీవూ నాతో ఉండాలి. నీకు భయం లేదుకదా!'' అంటూ తన మీసాల్ని మెలివేస్తూ బిగ్గరగా నవ్వాడు గుహ!

ఒక గంట లోపలే పోలీస్ పార్టీ బయలుదేరింది. దారిపొడుగునా పరమగురు, గుహ ఈ విషయం గూర్చే మరింత వివరంగా చర్చించుకున్నారు. రాత్రి పదకొండు గంటల సమయంలో పోలీసు పార్టీ ఆ గెస్ట్ హౌస్‌ను నాలుగు వైపుల్నుండీ చుట్టుముట్టింది. ఫ్లాష్‌లైట్లు ఆ అతిథి గృహాన్ని వెలుగులో ముంచెత్తాయి. ముందనుకొన్నట్లుగా తుపాకీ గుండ్లేవీ లోపల్నుండి బయటకు దూసుకురాలేదు.

గుహ స్వయంగా మైకు ద్వారా హెచ్చరిక చేశారు.

''వందలాది మంది సాయుధ పోలీసులు మిమ్మల్ని అన్నివైపుల్నుండి చుట్టుముట్టి ఉన్నారు. ప్రతిఘటించకుండా లొంగిపోండి. మీరందరూ చేతులు పైకెత్తుకొని బయటకువస్తే ఎవరికీ ప్రాణహాని జరగదు''

అడిషినల్ ఎస్పీ ఈవిధంగా మూడుసార్లు హెచ్చరిక చేశారు. కానీ లోనుండి ఏవిధమైన ప్రతిస్పందన రాలేదు. అందిన సమాచారం తప్పుగదా; గెస్ట్‌హౌస్‌లో ఎవరూ లేరు గదా! అనే సవాళ్ళు 'గుహ' బుర్ర మీసాల క్రింద ఉన్న గుహ్వారం నుండి వేటకుక్కల్లా విరుచుకుపడి పరమగురును పీడించసాగాయి.

అతిథిగృహం ముఖద్వారం తెరచుకొంది. ఎన్నో తుపాకులు ఊపిరి బిగపట్టి నిరీక్షిస్తున్నాయి. చేతులు పైకెత్తుకొని ఇరువురు వ్యక్తులు నెమ్మదిగా బయటకు వచ్చారు. వాళ్ళిద్దరూ ఎస్పీ, కలెక్టర్లన్న విషయం గుహ వెంటనే పసికట్టాడు. భగవంతుడా..ఇదేమిటి? వీళ్ళిద్దర్నీ ఉగ్రవాదులు బందీలుగా ఉంచారా! వీళ్ళ వెనుకగా మరెన్ని మర తుపాకులు బారులు తీరి ఉంటాయో యేమో! ఇటువంటి భయాందోళనలతో నిండిన ఆలోచనల్తో గుహ ముక్కు, చెవులు, కళ్ళ నుండి వెచ్చని ఆవిర్లు వెళ్ళుకొచ్చాయి. ఈ పరిస్థితిలో తన సారథ్యంలో జరుగుతున్న ఈ దాడి పూర్తిగా విఫలమైపోతుందేమో!

ఏమిటీ ఆశ్చర్యం! ఆ ఇద్దరు ముందుకు వస్తూనే ఉన్నారు. మెట్లుదిగి మైకులో గుహ హెచ్చరిస్తున్న దిశ వైపునకే తలలు వంచుకొని అడుగులేస్తున్నారు. వాళ్ళ వెనుకగా ఏ మరతుపాకులు గురిపెట్టిలేవు. కలెక్టర్ ఎస్పీ మెట్లు దిగి కొంత దూరం రాగానే పోలీసులు ఒక్కుమ్మడిగా అతిథిగృహం సమీపానికి జేరి దాన్ని చుట్టుముట్టారు. గెస్ట్‌హౌస్‌లో నుండి ఏ చిన్న శబ్దం వెలికి వచ్చినా, కదలిక కన్పించినా దాన్ని ఎదుర్కోటానికి పోలీసుల తీక్షణ నేత్రాలు, తుపాకుల నోళ్ళు సంసిద్ధమై ఉన్నాయి. మరికొందరైతే, ప్రాణాలను సైతం లక్ష్య పెట్టక గెస్ట్‌హౌస్‌లోకి దూసుకుపోవటానికి కాచుకొని ఉన్నారు. పరిస్థితులిట్లా

చేతిలో ఉన్న కెమేరా చురుగ్గా

పోతున్న వైనాన్ని గుహ గమనించ

గుహను సమీపించిన ఎస్పీ కం

యిలో ఈ ప్రశ్న బయటకు వచ్చింది.

''వాట్ నాన్సెన్స్ ఈజిట్ మిస్టర్ గుహ

''మిమ్మల్నిద్దరీ వాళ్ళు బందీలుగా పట్ట

చర్య తీసుకోకుండా ఉండగలమా? ఇంతపని

సించిన ఆ ఉగ్రవాదులెవర్నీ ప్రాణాలతో వదిలిపె

అని గుహ ఉద్రేకంతో చెప్తుండగా, పరమగురు అధరాలపై ఒక పరమహాసం లాస్యం చేసింది.

''ఎవరూ మమ్మల్ని నిర్బంధించలేదు. గెస్ట్‌హౌస్ లోపల వేరెవ్వరూ లేరు. మేమిక్కడ ఒక నైట్ హాల్ట్ కొచ్చాం, వాచ్‌మెన్ అతని క్వార్టర్‌లో ఉన్నాడు.'' అంటూ ఎస్పీ కంపిత స్వరం సమాధానం పలికింది.

ఈలోపు పోలీసులు గెస్ట్ హౌస్‌లోకి వెళ్ళి లైట్లన్నీ వేశారు. వాళ్ళ తీవ్ర ఆశాభంగానికి ఊరడింపుగా ఒక్క ఎలుకైనా దాని కలుగునుండి బయటకు రాలేదు.

కలెక్టర్ ఎస్పీ లిరువురు వాళ్ళ కారులో బయలుదేరారు. అడిషినల్ ఎస్పీ జీపు ఆ కారుకు రక్షణగా పోసాగింది. ట్రక్కులో వచ్చిన పోలీసు సిబ్బంది రక్తరహితమైన ఆ ఎన్‌కౌంటర్ గురించి ఏవేవో చెప్పుకొంటూ, నవ్వుకొంటూ జిల్లా కేంద్రానికి తిరోముఖమయ్యారు.

పగలంతా నివాసమున్న ఇన్స్‌పెక్షన్ బంగ్లాకు తిరిగి వచ్చిన ఎస్పీ కలెక్టర్‌ల గొంతులు సంపూర్ణంగా తడారిపోయినై. అయినాగానీ అడిషినల్ ఎస్పీ గుహను వెంటనే జిల్లా కేంద్రానికి తిరిగి వెళ్ళమని ఎస్పీ కంఠం ఆదేశించింది. ఇహ మరింత ఆలస్యం చేయకుండా ఎస్పీ కలెక్టర్ లిరువురూ తమ కారుల్లో జిల్లా కేంద్రానికి ప్రయాణమయ్యారు.

ఈ సంఘటన వల్ల అత్యంత ఆహ్లాదం పొందింది ఒక్క సి.సి. ప్రసాదే. ఆశ్చర్యం! ఈ విషయం గూర్చిన ఏ చిన్న వార్త కూడా మరసటిరోజు ఏ ప్రతికలోనూ దర్శన మీయలేదు. కానీ ఆ మరుసటి రోజు మాత్రం పత్రికల్లో ఈ వ్యవహారం సంక్షిప్తంగా ప్రచురితమైంది.

మరో నలభై ఎనిమిది గంటల్లో ఎస్పీ కలెక్టర్ లిరువురా రాజధానికి బదిలీ అయ్యారు.

ఈ సంఘటన ఎస్పీ కలెక్టర్‌ల కుటుంబాల్లో తీవ్ర కల్లోలాన్ని సృష్టించింది.

పరమగురు చేతిలో ఆనాటి ఫోటోలు పరమ రహస్యంగా ఈరోజువరకూ ఉన్నట్లు వార్త. అమాయకులైన ఆ ఎస్పీ కలెక్టర్‌లను బ్లాక్‌మెయిల్ చేయాలన్న ఆలోచన అతని మస్తిష్కంలో ప్రవేశించనే లేదు!

★

